
నేను, సాంబయ్య ఇరుగు పొరుగు ఇళ్ల వాళ్లం... మంచి స్నేహితులం...!

పావురాల గూళ్లమాదిరిగా తూర్పు వాకిలిగా అయిదిళ్లు, పడమటి వాకిలిగా అయిదిళ్లూ ఉన్న ఆ చిన్నకాలనీ పేరు అరుణా కాలని. ఓ పెద్ద ధనవంతుడు ఆ కాలనీ కట్టి మా బోటి మధ్యతరగతి వాళ్లకు అద్దెలకిచ్చాడు... ఆ ఇళ్లలో అద్దెకున్న వాళ్లందరూ నెలనెలా జీతాలు తెచ్చుకునే ఉద్యోగస్థులే...

వీధిలోంచి ఇంటిలోపలకు వెళ్లాలంటే ముందు వరండాలోకి రావాలి... అక్కడ నుంచి లోపలకు చూస్తే వంటింట్లో వంట చేస్తున్న వాళ్లు కనిపిస్తారు... వరండాలోంచి హాలు లోపల కెళ్లాలి... కుడి పక్కన బెడ్‌రూమ్... ఎడంపక్కన బాత్‌రూమ్, తరువాత టాయిలెట్... వెరసి ఇంతమాత్రం ఇంటికి నెలకు పదిహేనువందల రూపాయిల అద్దె చెల్లించాలి.

నేను ఒక ప్రైవేట్ కంపెనీలో ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్నాను. ఓ మాదిరి జీతం వస్తుంది. సాంబయ్య గవర్నమెంటు ఆఫీసులో హెడ్



అరిపిరాల సువర్ణ

# అశ్వత్థామ హతః కుంజరః

క్లర్కు. సంబళం కంటే కింబళం బాగా ముట్టే సీటు... కానీ ఆయన సాక్షాత్ ధర్మరాజే... అధర్మమైన పనుల జోలికే వెళ్లకపోవడం మాత్రమే కాదు... ఆధునికంగా ఉండేందుకూ ఇష్టపడడు.

ఆయన ఇల్లు అంతా బోసిపోతుంది - బీద ముత్తయిదువులా... హాలులో ఓ కుర్చీ, బెంచీ అనేవే ఉండవు... అందరిళ్లలోలా ఓ టీ.వీ. సెట్టు, సోఫాసెట్టు, వీ.సీ.ఆర్. కాదుకదా కనీసం ఓ రేడియోసెట్టు కూడా లేదు.

మా ఇంట్లో...? హాలులో కాలుపెట్టేందుకు నేల కనిపించకుండా కార్పెట్... కూర్చోడానికి ఆధునికమైన సోఫాసెట్టు... ఒనీడా టీ.వీ., డీవీడీ ప్లేయర్ వీటన్నిటితో హాలంతా అందంగా కనబడుతుంది. ఇదంతా మా ఆవిడ టేస్టే... టీ.వీ. టెలీషాపింగ్‌లో చూపించినవన్నీ క్షణాలలో కొనేస్తుంది. వాయిదాల పద్ధతిలో వీ.జీ.పీ. లోంచి తెచ్చేస్తుంది.

మా బాత్‌రూమ్‌లో నీళ్లు కాచుకునేందుకు గీజరుంటే, సాంబయ్య గారింట ఊకపొయ్యి. రాత్రిపూట ఊక కూరి అంటిస్తే తెల్లారేప్పటికి నీళ్లు కాగుతాయి.

మా ఇంట్లో మా పంకజం గాస్ పొయ్యి మీద హాయిగా వంటచేస్తే సాంబయ్యగారి భార్య సరస్వతమ్మగారు బొగ్గుల కుంపటి, కట్టెల పొయ్యితో అవస్థ పడుతోంది... మా ఆవిడ ప్రిస్టేజ్ కుక్కర్‌లో ప్రిస్టేజీగా వంట నిమిషాలలో చేస్తే, అక్కయ్యగారు అన్నం విడిగా, పప్పు విడిగా, కూర విడిగా, అన్నీ విడివిడిగా వండి, వంట పూర్తి చేసేసరికి కనీసం రెండుగంటల సమయం అయినా పడుతుంది. మా ఇంట బట్టలుతకడానికి వాషింగ్ మిషనైతే వాళ్లింట చాకలి బండ.

సరస్వతమ్మగారు నా భార్యకు పూర్తిగా విరుద్ధం. భర్తను కాదని ఏ సామానూ కొనదు... కొనమనీ వేధించదు... ఆమె తరచూ మా ఇంటికొచ్చి మా పంకజంతో బాగా మాట్లాడుతుంది. మా ఇంట్లో ఉన్న టీ.వీ. వంక డీవీడీ వంక, ఆశ్చర్యంగా తాజ్‌మహల్, చైనావాల్ వంటి సెవెన్ వండర్స్‌లా చూసి ఆరాతీస్తుందే కానీ అలాంటి వస్తువులు తమింట లేవే అని బాధపడదు... అసూయ చెందదు.

అక్కడికీ ఉండబట్టలేక సాంబయ్యతో అన్నాను.

"సార్! మిక్సీ, ఫ్రిజ్, టీ.వీ. వంటి వస్తువులన్నీ దినావసరవస్తువులే కానీ లగ్జరీలు కావు... మీరు అంత డబ్బు ఒకేసారి చెల్లించక్కరలేదు. సామాను ఇంటికి తీసుకెళ్లిపోయి, బిల్లు తేలికవాయిదాలలో నెలకింత అని చెల్లించవచ్చును..." అన్న నా మాటలను కొట్టిపారేశాడు సాంబయ్య.

"ఏమండీ సూర్యనారాయణగారూ! మన తాతముత్తాతలందరి కాలంలో ఏ గాస్‌పొయ్యిలున్నయ్యి? లక్షణంగా కట్టెల పొయ్యి, పిడకల దాలి మీద చేసిన వంటరుచి, కాచిన పాలరుచి గాస్ మీద చేస్తే వస్తుందా, మిల్క్‌బాయిలర్‌లో

కాస్తే వస్తుందా...?" అని ప్రతి దాంట్లోనూ ఏదో ఒక అనారోగ్యం దాగి ఉంది. అవి వాడిన వాళ్లమీదికి రావడం వల్లనే నేడు ఎన్నో కొత్త కొత్త రోగాలతో బాధపడుతున్నారని చెప్పి నా నోరు మూయించాడు.

కేవలం ఆధునిక పరికరాలు వాడకపోవ డం మాత్రమే కాదు... ఆయన కాళ్లకు చెప్పులు లేకుండానే రోడ్డు మీద నడుస్తారు... ఎవరైనా అడిగితే... మా నాన్నగారు బతికున్నంత కాలం చెప్పులేసుకోలేదు. మాకు కొనిపెట్టలేదు..." అని సమాధానం చెప్తాడు.

"సార్! ఆ కాలంలో రోడ్లంత డర్టీగా లేవు... ఆవులు, గేదెలూ రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడ పేడలేస్తయ్యి... ఊరకుక్కలతోపాటు పెంపుడుకుక్కలు రోడ్ల మీదే కాలకృత్యాలు తీర్చుకుంటయ్యి - అన్ని వేళలలోను... పొర బాటున వాటి మీద కాలు పడితే అసహ్యం మాత్రమే కాదు... హైజనీక్ కూడా కాద"ని నాతో పాటు ఇంకా ఎంతోమంది చెప్పినా విని పించుకోడు.

అలా చెప్పులేసుకోకపోయినా, రోడ్డుమీ దున్న పేడ - పెంటలలో అడుగేస్తానన్న భయం ఏ మాత్రం లేకుండా ఠీవిగా తలపైకెత్తుకు రోడ్డు మీద నడిచివెడతాడు సాంబయ్య.

నేనందుకు పూర్తి విరుద్ధం...! దాదాపు ప్రతిరోజూ నేను బయట నుంచి వచ్చి వరండా లో చెప్పులొదలగానే మొహం చిట్లించుకుని, ముక్కుమూసుకుని, "ఏమిటండీ ఇంత పాడు కంపు మీ చెప్పులలోంచి... రోడ్డు మీద నడుస్తు న్నప్పుడు కింద చూసుకునడవరా... ఆకాశాన్ని చూసుకుంటూ నడుస్తారల్లే ఉంది... అందుకే రోడ్డు మీదున్న అసహ్యాలన్నిటినీ తొక్కుకుంటూ వస్తారు..." అని నా చెప్పుల్ని కర్రతో తీసికెళ్లి కడుగుతుంది.


తప్పుచేసిన వానికిమల్లే పంకజం పెట్టే చివాట్లన్నీ మౌనంగా భరించే నన్ను సరస్వతమ్మ గారు పరితాపంగా చూస్తారు.

"పాపం అన్నయ్యగారేం చేస్తారు...? రోడ్ల న్నీ అంత అసహ్యంగా ఉంటేను...?" అని నాకు సపోర్టు చేస్తారామె.

"రోడ్లు ఎంత అసహ్యంగా ఉంటే ఏం...? జాగ్రత్తగా కింద చూసుకుంటూ నడిస్తే ఏ అస హ్యంమీదా అడుగుపడదు. అన్నయ్యగారసలు చెప్పులే వేసుకోరు...! ఆయన ఏనాడైనా... అసహ్యం మీద అడుగేశాననిచెప్పి కాళ్లు కడు క్కున్నారూ...?" అని పంకజం అడిగిందీ పా యింటే అనిపించింది.

'ఆయన ధర్మరాజుగా మరి...! కురుక్షేత్ర యుద్ధంలో తతిమా వీరులందరి రథచక్రాలూ భూమిమీద నుంచి పరుగులు తీస్తే, ధర్మరాజు రథం మాత్రం భూమికి మూడు నాలుగంగుళా లు పైనుంచి పరిగెడుతుందంటారు... అలాగే ఈ కలియుగ ధర్మరాజు పాదరక్షలు లేకుండా నడిస్తే ఏం...? ఆ ధర్మరాజు రధానికి మల్లే ఈ సాంబయ్య భూమికి రెండు మూడుంగు ళాలు పైనుంచి నడుస్తాడల్లే ఉంది... అందుకే ఆయన అడుగు ఏ అసహ్యంమీదా పడదు.

అనకూడదుకానీ సాంబయ్య నిజంగా ధర్మ రాజే... ఆయన కూర్చున్న సీటు లంచాలకు పుట్టిల్లు... లంచం రాల్చందే ఒక్క పేపరూపైకి వెళ్లదు. అయినా సాంబయ్య ఎవరి దగ్గరా పైసా లంచం తీసుకోకుండా అందరిపేపర్లూ అధికార్ల సంతకాలకు పంపి, వారి వారి పనులను సకా లంలో పూర్తి చేసి పెడతాడు... తోటి గుమస్తా లు తీసుకుని, ఆయన భాగానికి వచ్చింది




ఇచ్చినా పుచ్చుకోడు.

ఆ విషయాలన్నీ తెలిసిన నేను ఒకసారి "సాంబయ్యగారూ! మీరు మరీనూ... కాలాతీత మనుష్యులుగా ఉన్నారే...? వాళ్లు సంతోషంగా ఇచ్చే కానుకలను తీసుకోవడంలో తప్పేముంది...?" అని అడిగాను.

"అవి కానుకలా...? మనిళ్లలో ఏదైనా ఫంక్షన్‌కి పిలిస్తే వచ్చి భోజనంచేసి వాళ్ల తాహతుకుతగ్గ సామానేదైనా ఇస్తే అది అమితానందంతో తీసుకుంటాను. ఆఫీసులో మనం వాళ్ల పనులకోసం... పని చేయడానికని మనల్ని ఉద్యోగాలలో పెట్టి నెలనెలా జీతాలిస్తూంటే మళ్లీ వాళ్ల దగ్గర నుంచి తీసుకునేవి కానుకలు కావు... పాపపు మూటలు. సంతోషంతో ఇవ్వరు... కడుపుమంటతో ఇస్తారు... మా నాన్నగారు నన్నెప్పుడూ అలాంటి పాపపు సొమ్ముకు ఆశపడవద్దని మాట తీసుకున్నారు" అన్న సాంబయ్య అలా వాళ్ల నాన్నగారు మాట తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు.

"నేను చదువుకునే రోజుల్లో నాకు స్కూలు ఫీజులు కట్టలేక బీద విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌కి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకునేందుకు తాసీల్దారు కానుక ఇవ్వందే సర్టిఫికెట్టు ఇవ్వనంటే నాన్నగారు వాళ్లదగ్గర, వీళ్లదగ్గరా బతిమిలాడి, కాళ్లు పట్టుకుని ఆయనడిగిన సొమ్ము అప్పుగా తెచ్చి సమర్పించుకున్నాకే ఆయన నేను బీద విద్యార్థినని స్కాలర్‌షిప్ మంజూరు చెయ్యవచ్చన్న సర్టిఫికెట్టు ఇచ్చాడు...

"మా నాన్న పెట్టిన శాపనార్థాల ఫలితమో ఏమో కానీ నెల తిరక్కుండానే ఆ తాసీల్దారు ఏకైక పుత్రుడు కారు యాక్సిడెంటులో పోయాడు. కొడుకుపోయిన షాకులో ఆ తల్లి పిచ్చిదైపోయింది. అందుకే చట్టం దృష్టిలోనే కాదు... భగవంతుని దృష్టిలోనూ లంచం తీసుకోవడం మహాపెద్దనేరం... చట్టంకళ్లు కప్పినా భగవంతుని కళ్లు కప్పలేమని తాసీల్దారే పెద్ద ఉదాహ

రణ..." అని పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు సాంబయ్య.


ఆయన తండ్రికిచ్చిన మాటమీదే ఉండి, ప్రభుత్వం నెలనెలా ఇచ్చే జీతంతో పొదుపుగా బతికి, ఇద్దరుకూతుళ్లనూ డిగ్రీ వరకూ చదివించాడు సాంబయ్య.

ఉన్నంతలోనే నగానట్రా చేయించి ఏదో మాదిరిగా కట్నం ఇచ్చి పెద్దకూతురు పెళ్లి చేసాడు. చిన్నకూతురుకు పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నాడు సాంబయ్య.


నా కజిన్ నరసింహారావుకు ఇద్దరబ్బాయిలు. పెద్ద కొడుక్కి దండీగా కట్నకానుకలు తీసుకుని, గొప్పింటి అమ్మాయితో పెళ్లి చేసాడు. పెళ్లి అయిన ఆరునెలలలోనే తండ్రి పలుకుబడితో మొగుడికి తల్లిదండ్రులున్న ఊరికే ట్రాన్స్‌ఫర్ చేయించిన కోడలి పుణ్యమా అని నాలుగు సంవత్సరాలుగా వారికి ఇల్లరికపు అల్లుడైపోయిన కొడుకు మళ్లీ ఇటువైపు మొహం చూపించనేలేదు... అందుకు వాళ్లకు బాగా బుద్ధివచ్చి, కట్నం కాస్త తక్కువైనా ఫరవాలేదని చిన్నకొడుక్కి పేదింటి అమ్మాయినే చూస్తున్నారని తెలిసి సాంబయ్యగారి అమ్మాయిని చూసుకునేందుకు రమ్మన్నాను.

సాంబయ్యగారి సంబంధం అన్నయ్య, వదినలకు బాగా నచ్చింది. వాళ్లమ్మాయి శ్వేత మా రవికి నచ్చింది. రవి శ్వేతకు బాగా నచ్చాడు. తతిమా అన్ని విషయాలూ మాట్లాడుకున్నారు. పెద్దమ్మాయికి చేసినట్లే శ్వేతకు చేస్తానన్నాడు సాంబయ్య.

కట్నం, నగా నట్రా పెళ్లి ఖర్చులకింతింత అవుతయ్యని లెక్కలువేసి – పీ.ఎఫ్, గ్రాట్యుటీ అడ్వాన్స్, పెళ్లి అడ్వాన్స్ అని ఎన్ని తీసుకున్నా ఖర్చుకు డెబ్బై అయిదువేలు లోటు కనిపిస్తున్నది.



కాకినాడలో శ్రీ యస్.ఆర్. పృథ్వి 'గుండె ఊటలు' నానీల సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రజాకవి శ్రీ అద్దేపల్లి రామమోహనరావు. శ్రీ వక్కలంక రామకృష్ణ, డా॥ ఆలూరి విజయలక్ష్మి, డా॥ పి. చిరంజీవినీ కుమారి, శ్రీ వై.డి. రామారావు, శ్రీ యస్.ఆర్. పృథ్వి, శ్రీ జి. సుబ్బారావు ఫొటోలో ఉన్నారు.




డబ్బై అయిదు వేలంటే కొంచెం పెద్దమొత్తమే...! అంత డబ్బు ఎవరు అప్పుగా ఇస్తారు...? ఇచ్చినా తనెలా తీర్చగలడు... అని తల పట్టుకున్నాడు సాంబయ్య.

సాంబయ్య సాధారణంగా ఎవరినీ అప్పు అడగడు... ఒకవేళ అడిగినా ఇవ్వడానికి సంకోచిస్తారందరూ... సంబళం తప్ప కింబళాలు తీసుకోని ధర్మరాజువంటి సాంబయ్యకు అప్పు ఇస్తే అప్పు కింద భార్యను జమ చేస్తాడన్న భయంతో.

పోనీలే ఈ సంబంధం కాకపోతే మరోటి అని సాంబయ్య అన్నయ్య సంబంధం వదులుకోవడానికి ఇష్టపడలేదు. మంచి సంబంధం. అమ్మాయి, అబ్బాయి ఒకరికొకరు నచ్చి బాగా ఇష్టపడ్డారు... అన్నయ్యకూ అంతే...!

అయినా కట్నకానుకలేవీ వద్దు... ఉన్నంతలో పెళ్లి జరిపించండని చెప్పడానికి అన్నయ్యకి ప్రిస్టేజ్ అడ్డం వచ్చింది.

ఓ రోజు సాంబయ్య మా ఇంటికొచ్చి "అయ్యా సూర్యనారాయణగారూ! ఒక్క ఆరు నెలలు పెళ్లి వాయిదా వెయ్యమని చెప్పండి మీ అన్నగార్కి..." అన్నాడు. ఈ విషయం అన్నయ్యతో చెప్తే సంతోషంగా అంగీకరించాడు.

రెండు నెలలు గడిచిపోయినయ్యి. సి.ఎల్.లు మురిగిపోతున్నాయని ఆ రోజు ఆఫీసుకు సెలవుపెట్టి ఇంట్లోనే ఉన్నాను. పంకజం కొత్తగా తెరిచిన షాపింగ్ మాల్‌కి వెళ్లింది. పిల్లలు కాలేజీలకెళ్లారు.

నా స్నేహితుడు 'కథాకేళి' పత్రికకు నా అడ్రసు రాసినట్లున్నాడు. వాడు రాసిన కథ పడిన సంచిక అప్పుడే పోస్ట్‌లో వచ్చింది. సావిట్లో పడక్కుర్చీలో పడుకుని, దాన్ని తెరిచి పేజీలు తిరగేస్తున్నాను.

వాకిట్లో ఆగిన పెద్దకారులోంచి సూటు బూటు వేసుకున్న ఓ పెద్ద మనిషి చేతిలో బ్రీఫ్ కేస్‌తో మా ఇంట్లోకి రావడం చూసి కంగారుగా

లేచి నిల్చున్నాను. ఆయన్నిదివరలో ఎక్కడా చూసిన గుర్తులేదు.

ఆయన లోపలికొస్తూనే "ఎక్స్‌క్యూజ్‌మీ సార్... ఫలానా ఆఫీసులో సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్న సాంబయ్యగారిల్లు ఇదేనా...?" అని అడిగేసరికి ఓహో, సాంబయ్యగారింటికెళ్ల వలసిన శాల్తీ పొరపాటున ఇక్కడికొచ్చాడన్న మాట అనుకొంటూ...

"ఇది కాదు సార్... ఎదురిల్లు... ఆయని ప్పుడు ఇంట్లో ఉండరు. ఆఫీసులో ఆఫీసు వర్క్ చేస్తూంటారు..."

"అహో...! అలాగా! ఆయనకు మీరు ప్రాణ స్నేహితులని తెలిసి ఆయన గురించిన వివ రాలు తెలుసుకోవాలనే మీ ఇంటికొచ్చాను సార్..." అన్న ఆయన నేను చెప్పకుండానే అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ, "మీరూ కూర్చోండి సార్..." అని నా ఇంట్లో నాకే మర్యా దచేసాడు

"నాకు ఆయనతో ఓ పని పడింది సార్... దాని గురించి మీతో మాట్లాడుదామని మిమ్మ ల్ని వెతుక్కుంటూ వచ్చాను సూర్యనారాయణ సాబ్...!" సాంబయ్యతో పని పడితే నాతో మాట్లాడ్డం ఏమిటని మనసులోనే ఆశ్చర్యపో యాను. ఆయన చెప్పేది వింటున్నాను.

"నా పేరు సుదర్శనం. నేనో గవర్నమెంటు కాంట్రాక్టర్ని... కోటి రూపాయల కాంట్రాక్టుకి ప్రభుత్వం టెండర్స్ కాల్‌ఫర్ చేసింది... సాంబ య్య సాబ్ డిపార్ట్‌మెంటుకి సంబంధించిన టెండర్... ఆయనే టెండర్స్ రిసీవ్ చేసుకుం టాడు. ఎల్లుండి ఆఖరిరోజు... ఆ కాంట్రాక్టుకి బాగా పోటీ ఉంది. టెండర్‌కి సంబంధించిన రహస్యాలన్నీ ఆ సాబ్‌కి మాత్రమే తెలుసు..."

"ఎవరు అతి తక్కువగా కోట్ చేసేదీ ఆయ న నుంచి తెలుసుకుని, దానికంటే తక్కువగా కోట్ చేసి, రేపు టెండర్ సబ్‌మిట్ చేద్దామను కుంటున్నాను... అది నాకాయన ఊరికే చేసి పెట్టక్కరలేదు..." అని సుదర్శనం చెప్పింది విన్నాక ఈయన సాంబయ్యకు లంచం ఇవ్వా లనుకుంటున్నాడని అర్థమైంది.

"ఆయన దగ్గర మీ పప్పులేం ఉడకవు... మీరు వచ్చిన దారినే బయలుదేరండి... మిస్టర్ సుదర్శనం! సాంబయ్యగారి గురించి మీకు తెలీ దనుకుంటాను. ఎట్టి పరిస్థితిలోనూ ఆయన అవినీతికి తలవంచడు. హీ ఈజ్ వెరీ వెరీ ఆనెస్ట్ పర్సన్... అపర ధర్మరాజు..."


"ఆ విషయం నాకూ తెలుసు సాబ్. అందు కే ముందుగా మిమ్మల్ని అడిగి తెలుసుకుందా మనుకుని మీ ఇంటికి వచ్చాను... మరి ఆయన మిసెస్...?"

"ఓహో పెరటివైపు నుంచి ప్రవేశించాల నా?... ఆమె భర్త అడుగు జాడలలో నడిచే మహా పతివ్రత... మీరెళ్లి ఆమెదగ్గర ఈ ప్రస్తా వనచేస్తే మొహాన పేడనీళ్లు చల్లి పంపిస్తుంది... మర్యాదగా వెనక్కితిరిగి వెళ్లడం మంచిది."

"అలా అనకండి సార్. ఈ ప్రపంచంలో ప్రతి ఒకరికీ ఒక సమయం అంటూ వస్తుంది. కొన్ని అవసరాలు ఎంతటి బలవంతుణ్ణీ బల హీనపరుస్తాయి..." అని ఆయన చెప్పి వెళ్లిన మాటలు నూటికి నూరుపాళ్లూ నిజం అయి కూర్చున్నాయి.

నా సీ.ఎల్. పూర్తయి ఆఫీసుకెళ్లిన మధ్యా హ్నం ఆఫీసు పనిలో తలమునకలవుతూంటే టేబుల్ మీది ఫోను మోగింది.

విసుగ్గా రిసీవర్ ఎత్తి చెవి దగ్గర పెట్టుకుని




"హలో...!" అనగానే అవతలవైపు నుంచి "హలో సూర్యనారాయణగారూ. నేను సాంబయ్యను మాట్లాడుతున్నాను. మీ అన్నగార్ని రేపే రమ్మనండి. ఆరునెలల వరకూ ఆగక్కరలేదు. అంతకంటే ముందుగానేఉన్న మొదటి ముహూర్తానికే పెళ్లి నిశ్చయించేసుకుందాం. పైకం సర్దుబాటు అయింది..." అని అన్న సాంబయ్య మాటలు విన్న నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాయి... తప్పుగా విన్నానా అని నా చెవుల మీద నాకే అనుమానం వచ్చింది.

వెంటనే సుదర్శనం ఆ రోజు అన్నమాటలు గుర్తుకొచ్చినయ్యి. అంటే... అంటే... కురుక్షేత్ర యుద్ధంలో ద్రోణాచార్యులను చంపడానికి చావులేని ద్రోణుని కుమారుడైన అశ్వద్ధామ చనిపోయాడని చెప్పడానికి ధర్మరాజు అంగీకరించినట్లే కూతురు పెళ్లి కోసం సుదర్శనం దగ్గర నుంచి సాంబయ్య లంచం తీసుకున్నాడన్న మాట...

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొచ్చి, మొహం కాళ్లూ చేతులూ కడుక్కుని వరండాలో కూర్చుని కాఫీ తాగుతున్నాను.

"సరస్వతీ! చెంబుతో నీళ్లు పట్రా... దారిలో నడిచొస్తూంటే ఏ అసుద్ధం మీదో కాలేసినట్లున్నాను... తొందరగా కాళ్లు కడుక్కోవాలి... కంపు భరించలేకపోతున్నాను..." అని సాంబయ్య వాకిట్లో నిలబడి అరవడం వినిపించింది.

యుద్ధభూమిలో ధర్మం అధర్మాన్ని జయించడానికి "అశ్వద్ధామ హతః..." అని అనగానే అంతవరకూ భూమికి రెండు మూడు అంగుళాల పైన పరిగెడుతున్న ధర్మరాజు రథం భూమి మీదగా పరిగెత్తడం మొదలెట్టినట్లుగానే... ఒక్క పైసా లంచం తీసుకోని సాంబయ్య కూతురు పెళ్లికని సుదర్శనం నుంచి లంచం తీసుకోగానే అంతవరకూ ఏ అసుద్ధం మీదా అడుగెయ్యని వ్యక్తి ఇప్పుడు అసుద్ధాన్ని తొక్కివచ్చాడు. ●